# వెలయాలు




*కుసుమే కుసుమోత్పత్తిః*
*శ్రూయతే నతు దృశ్యతే*
*బాలే తవ ముఖాంభోజే*
*దృష్ట మిందీవరద్వయం*

**భావం:** పువ్వులో నుంచి పువ్వు పుడుతుందన్నమాట వినడమే కానీ ఎక్కడా అలా జరగదు. ఓ బాలామణీ, నీ ముఖమనే తామరపువ్వులో రెండు కలువలు కన్పిస్తున్నాయి.

ధారానగరాధీశుడైన భోజుడు మహాకవి కూడా. గద్యపద్యాత్మకంగా చంపూ రామాయణాన్ని రచించాడు. ఎందరో కవి పండితులను పోషించాడు.

భోజరాజుని చూస్తేనే ఎవరికైనా కవిత్వం చెప్పగల శక్తి వస్తుందని జనశ్రుతి. ఆయన ఆస్థానంలో కాళిదాస మహాకవి ఉండేవారు. ఇద్దరి మధ్యా కవిత్వ విషయంలో, పాండిత్యంలో, ఇతర శాస్త్రాలలో చర్చలు జరుగుతూ ఉండేవి. కవిత్వంలో చదువరులకు ఆనందం కలిగేది రసం వల్లనా లేక అలంకారాల వల్లనా అని ఇద్దరూ చర్చించుకున్నారు. వాదనా పటిమలో భోజుడు కాళిదాసుని మించలేక పోయాడు. అశక్తత వలన కలిగిన కోపంతో 'కవులు నిరంకుశులు. వారు ఏమంటే అది అందరూ అంగీకరించాలి' అన్నాడు.

'తాము మాత్రం కవులు కారా' అని కాళిదాసు అన్నాడు.

'తాము మహాకవులు కదా' అని భోజుడన్నాడు.

మాటామాటా పెరిగింది. కాళిదాసు నేను మహాకవినే కావచ్చు. నిరంకుశుణ్ణే కావచ్చు. కానీ తాము అన్నిచోట్లా నియంతలు. ఎవరికైనా మరణశిక్ష వెయ్యగలరు. రాజ్యం నుంచి బహిష్కరించగలరు' అన్నాడు. భోజుడు వెంటనే 'ఈ క్షణమే మీరు రాజ్యం వదిలిపొండి' అన్నాడు. కాళిదాసు వెంటనే కట్టుబట్టలతోనే బయల్దేరాడు. ఆయనలో కోపం రగిలిపోతోంది. భోజుడు క్షమాపణ కోరినా ఆగదల్చుకోలేదు. దేశాలు నడిచి, సముద్రాలు దాటి, సింహళ ద్వీపం చేరుకున్నాడు. ఒక వేశ్య ఇంట్లో నివసించసాగాడు. ఆయన శరీరంపై ఉన్న రత్నాభరణాలనీ, వజ్రాల అంగుళీయకాలనీ చూసిన వేశ్య ఆయన ధనవంతుడనుకుని ఆయనతోనే ఉండసాగింది.

భోజరాజుకి పశ్చాత్తాపం కలిగింది. కాళిదాస మహాకవికై దేశ విదేశాలలో వెతికించాడు. ఆయన ఏ రాజాస్థానంలోనూ, ఏ కవి పండిత గోష్ఠి లోనూ కనిపించలేదు. చివరి ప్రయత్నంగా భోజుడు 'కుసుమే కుసుమోత్పత్తిః శ్రూయతేతు న జాయతే' అన్న పద్యభాగాన్ని ఇచ్చి పద్యం పూరించిన వారికి సన్మానమూ, అపరిమిత ధనమూ లభిస్తాయని దేశ దేశాలా చాటింపు వేయించాడు.

సింహళ దేశంలో దేవాలయంలో నాట్యం చేస్తున్న వేశ్య చాటింపు వింది. ఇంటికి వచ్చి అజ్ఞాతంలో ఉన్న కాళిదాసుతో చాటింపు సంగతి చెప్పకుండా పద్యభాగం విన్పించింది.

కాళిదాసు ఆమె సుందర ముఖాన్ని చూస్తూ 'బాలే తవ ముఖాంభోజే దృష్టమిందీ వరద్వయం' అన్నాడు.

'బాలామణీ, నీ ముఖం తామరపువ్వులా ఉంది. అందులో నీ కళ్ళు రెండుకలువ పూల వలె ఉన్నాయి' అని పూరించిన పద్యభాగానికి అర్థం.

'నిజం గానా' అంటూ కాళిదాసు ఆమెను వగలు పోయింది. 'సత్యం' అంటూ కాళిదాసు ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. ఆమె స్వర్గాన్ని చూపించింది. రాత్రి మహాకవి నిద్రించాక ఆమె ఆయనను చంపి, శీఘ్రంగా ధారానగరం చేరుకుని రాజాస్థానంలో పద్యం వినిపించింది.

అంత సుందరంగా కాళిదాసు తప్ప ఇంకెవరూ పూరించలేరని తెలిసిన భోజుడు విచారణ జరిపించాడు. విషయం తెలిసి విలపించాడు.

ఈ కథకు ఏ విధమైన చారిత్రకాధారాలూ లేవు. కానీ ఏ మగవాడైనా సరే ఎంతటి సౌందర్యవతి అయినా ఎంతటి సరసురాలైనా వెలయాలిని ఆశ్రయించరాదన్న హెచ్చరిక మాత్రం ఉంది.

******